క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠించాలి

పోరుమామిళ్ల : ప్రతిఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని టీటీడీ ధర్మప్రచార మండలి జిల్లా సభ్యుడు తుపాకుల శ్రీనివాసులు అన్నారు. గీతాజయంతి సందర్భంగా స్థానిక శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, పెద్దలకు, మహిళలకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికేశవ, పోకల సుబ్బారెడ్డి, చెన్నక్రిష్ణయ్య, తిరుపతయ్య, నరసింహారెడ్డి, రాణిరత్నప్రభ, ఉమాదేవి, సుష్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరాధనకు బందోబస్తు

కాశినాయన : కాశినాయన ఆరాధన ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన జ్యోతిక్షేత్రాన్ని పరిశీలించి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కాశినాయన సమాధి దర్శనం కల్పించేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం దాదాపు వంద మందిపైకిగా పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాశినాయన, పోరుమామిళ్ల ఎస్ఐలు హనుమంతు, కొండారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

5న రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం

ప్రొద్దుటూరు : రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ 38వ సర్వసభ్య సమావేశాన్ని జనవరి 5న ఉదయం 10.30 గంటలకు తిరుపతిలోని రెడ్డి భవనంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ శ్రీశైలం జాయింట్ సెక్రటరీ బైరెడ్డి అంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో అధ్యక్షుల వారి సందేశం, ప్రధాన కార్యదర్శి నివేదిక, 2023–24 సంవత్సరం ఆడిట్ చేసిన జమా ఖర్చుల పరిశీలన, ఆమోదం, 2024–25 సంవత్సరం సవరించిన జమా ఖర్చులు, 2025–26 అంచనాల పరిశీలన, ఆమోదం ఉంటుందని ఆయన వివరించారు. సంస్థ సమగ్రాభివృద్ధికి సభ్యులు సూచనలు ఉంటాయని, ఉమ్మడి కడప జిల్లా సభ్యులందరూ సమావేశానికి తమ ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సంస్థ గుర్తింపు కార్డుతో తప్పక హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440222467 సెల్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

ప్రొద్దుటూరు : పట్టణంలో పలు వార్డుల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించి శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద చెత్త పాయింట్‌ను శుభ్రం చేయించారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి మడూరు కెనాల్ వరకు కాలువలో షీల్ట్ తొలగించాలని శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ధర్డ్‌కాలనీలోని పార్కును ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎద్దుల వెంకటసుబ్బమ్మ హైస్కూల్ వద్ద కాలువలో పూడికతీతక పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎం.గోవిందరెడ్డి, వి.సుబ్బరాయుడు, ఎం.సునీత పాల్గొన్నారు.

ఆటోక్లేవ్ వితరణ

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు గురువారం మదర్ థెరిసా ఫౌండేషన్ నిర్వాహకులు ఆటోక్లేవ్ అందచేశారు. ఇటీవల జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఆసుపత్రిని సందర్శించినపుడు దంత వైద్యురాలు సవిత తమకు ఆటోక్లేవ్ బాయిలర్ లేనందున ఇబ్బందిగా ఉందని వారితో చెప్పారు. దీంతో రవిప్రకాష్‌రెడ్డి ఆటోక్లేవ్ కొనుగోలు చేసి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ గిరిప్రణీత్‌రెడ్డి ద్వారా ఆసుపత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకన్న, నాగేంద్ర, రవి, గౌరీప్రియ, ఫిజియోథెరపిస్టు ఆనంద్ పాల్గొన్నారు.

14 బియ్యం బస్తాల స్వాధీనం

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని ప్రైవేటు ట్రావెల్స్ వద్ద సరఫరాకు సిద్ధంగా ఉన్న 14 రేషన్ బియ్యం బస్తాలను గురువారం రాత్రి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు ప్రైవేటు ట్రావెల్స్‌లో తరలించేందుకు తాళ్లమాపురం గ్రామానికి చెందిన రామాంజనేయ అనే వ్యక్తి ఉంచగా.. వాటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. ఒక్కో బస్తాలో 23 కేజీల బియ్యం ఉంటాయని అంచనాగా చెప్పారు.

అన్నమయ్య సేవారత్న పురస్కారం

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సంస్థ అధ్యక్షుడు దొడియం అఫల్‌కు గురువారం రాజంపేటలో విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం వారు సేవా అన్నమయ్య సేవా రత్న పురస్కారాన్ని అందించి సత్కరించారు. తాను ప్రొద్దుటూరులో దివ్యాంగులకు, వయో వృద్ధులకు చేస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారని ఈ సందర్భంగా అఫ్జల్ తెలిపారు.

నీటి నిల్వపై నిర్లక్ష్యపు నీడలు


బ్రహ్మంసాగర్‌లో ఉన్న నీరు


సాగర్ కుడి కాలువ నుంచి వృథాగా పోతున్న నీరు

- బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీరు నిల్వచేస్తామన్న కూటమి ప్రభుత్వం
- ప్రస్తుతం 11 టీఎంసీల నిల్వ
- మరమ్మతులకు నోచుకోని గేట్లు.. వృథాగా పోతున్న నీరు

బ్రహ్మంగారిమఠం : తెలుగుగంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో 17.5 టీఎంసీల నీరు నిల్వ ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 11.04 టీఎంసీలకే అధికారులు నీటిని ఆపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 16 టీఎంసీల నీరు నిల్వ చేయగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ ఏడాది 17 టీఎంసీల నీరు నిలుపుతామని ప్రకటన చేశారు. అయితే గత వారం రోజులుగా వెలిగోడు నుంచి ఎస్సార్ - 1, ఎస్సార్ - 2 ద్వారా బ్రహ్మంసాగర్‌కు వచ్చే నీటిని నిలుపుదల చేశారు. ప్రస్తుతం 11.04 టీఎంసీల నీరు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో సాగర్ కుడి కాలువ గేట్లు సరిగా లేకపోవడంతో దాదాపు 150 క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. గేట్ల మరమ్మతులకు తెలంగాణ నుంచి నిపుణులను పిలిపించినప్పటికీ సరిగా పని చేయకపోవటంతో లాభం లేకుండాపోతోంది. అధికారులు మాత్రం మరో రెండు రోజులు గేట్లు పూర్తిగా బంద్ చేస్తామని తెలియజేస్తున్నారు. ఎడమ కాలువ ద్వారా దాదాపు 400 క్యూసెక్కుల నీటిని బయటికి వదులుతున్నారు. ఈ నీరు బి.కోడూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల పరిధిలోని చెరువులను నింపుతున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. గేట్లు మరమ్మతులు పూర్తయితే సాగర్‌లో 7 టీఎంసీల నీరు అయినా ఉంటుందని అధికారులు అంటున్నారు. సాగర్ నుంచ ఆర్టీపీపీ, బద్వేలు, బి.మఠంకు తాగు నీరు కోసం నీటిని విడుదల చేస్తుండగా, వ్యవసాయానికి ఉపయోగపడేలా నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానది తీరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి మండల పూజ సందర్భంగా అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. వేకువ జామున అయ్యప్పస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా రూపొందించి హంస వాహనంపై కొలువుదీర్చి ఆశీనులను చేశారు. అయ్యప్పస్వామి దీక్షదారులు, భక్తులు అయ్యప్పస్వామి నామస్మరణల మధ్య పురవీధుల్లో గ్రామోత్సవం అట్టహాసంగా సాగింది. అమ్మవారిశాల నుంచి ప్రారంభమైన ఈ గ్రామోత్సవం బంగారు అంగళ్లవీధి, సుందరాచార్యుల వీధి, గాంధీ రోడ్డుల మీదుగా శివాలయం చేరుకుంది. ఈ వేడుకలో కేరళ సింగారిమేళం, నరసరావు పేట తప్పెట్లు, కోలాటం, బాణాసంచా పేలుళ్ల, వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు, చిన్నారులు పెద్దఎత్తున పాల్గొని దీపాలతో స్వామి వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్వామి అయ్యప్పసేవా సంఘం అధ్యక్షుడు కొవ్వూరు రమేష్ రెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్, అయ్యప్పస్వామి, అమృతేశ్వరస్వామి ఆలయ ప్రతినిధులు, అయ్యప్పస్వామి దీక్షదారులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయం




మాట్లాడుతున్న డీఎల్‌డీఓ శ్రీనివాసులు

గోపవరం : గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని డీఎల్‌డీఓ జె.శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో అన్నిశాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు సుస్థిర అభివృద్ధి సాధించేందుకు చేపట్టవలసిన అంశాలపై సిబ్బందికి వివరించారు. అన్నిశాఖల సమన్వయంతో అధికారులు, సిబ్బంది పనిచేసి అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హసీనా, ఎంఈఓ రఘురాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

బద్వేలు అర్బన్ : గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ మల్లేశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో సుస్థిరాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ద్వారా గ్రామ పంచాయతీల అభివృద్ధికి కావాల్సిన సూక్ష్మ ప్రణాళికలను సిద్ధం చేయాలని, ఇందులో ప్రజలను కూడా భాగస్వాములు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపరచడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అంశాలను కూడా ప్రణాళికలో పొందుపరచాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఖాజీపేట : మండలంలోని రైతులు చుక్కల భూముల సమస్యల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, రెవెన్యూ సిబ్బంది వెంటనే సమస్యను పరిష్కరించి రైతులను న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండల రెవెన్యూ కార్యాలయంలో సాయంత్రం తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాల కారణంగా రైతులు నేడు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. తరతరాల నుంచి సంక్రమించిన భూములు కూడా నేడు ఆన్‌లైన్ కావడం లేదని అన్నారు. మ్యూటేషన్ తోపాటు రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదని పేర్కొన్నారు. చుక్కల భూముల సమస్య పరిష్కారానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యం వహించారన్నారు. ప్రభుత్వ భూముల చట్టాలకి లోబడి 22–ఏలో ఉంచారని దీనిని తొలగించాలని గత ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. ఈ కారణంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా పొందేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి మండలంలోని 4వేల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేసీ కెనాల్ మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసుల రెడ్డి, అగ్రహారం సొసైటీ మాజీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, నాయకులు వేమారెడ్డి ఏటూరు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం చూపుతాం

చాపాడు : రైతుల నుంచి వచ్చే ప్రతి అర్జీకు పరిష్కారం చూపుతామని తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని మడూరు గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సదస్సుకు రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపుతామన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సదస్సులో రైతులు తమ సమస్యలపై ఫిర్యాదు చేయాలని, వాటిని పరిష్కారం అయ్యేంత వరకు అధికారులను అడిగే హక్కు రైతులకు ఉంటుందన్నారు. ఈ సదస్సులో 12 ఫిర్యాదులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి, రీ సర్వే డీటీ నారాయణ స్వామి, ఆర్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు అందించాలి

బ్రహ్మంగారిమఠం: తెలుగు గంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం బి.మఠంలో సీపీఎం మండల 5వ మహాసభలు కామ్రేడ్ హరి, కామ్రేడ్ రమణమ్మల ఆధ్వక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్రహ్మంసాగర్ నిర్మించి దాదపు ఏళ్లు గడుస్తున్నా రైతులకు ప్రభుత్వాలు న్యాయం చేయలేదన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంను జాతీయ పర్యాటక కేంద్రంగా ప్రభుత్వం గుర్తించాలన్నారు. కుందు వరదను రాజోలి నిర్మాణంను పూర్తి చేసి సాగర్‌కు నీరు అందించాలన్నారు. బిమఠంలో భక్తులకు సరైన బస్ షెల్టర్ లేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యుడు శివ కుమార్ మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలో సమస్యలు ఇప్పటి ప్రభుత్వం స్పందించి పూర్తి చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, సీపీఎం మండల నాయకులు ఎస్.గోవిందు, జి.సునీల్, సభ్యులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రైతు సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొని విజయవతం చేయాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలల పరిపాలన కాలంలో సంక్షేమ పథకాలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా రైతులకు రైతు భరోసా అందక అప్పుల పాలవుతున్నారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు, రైతులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

చాపాడు : ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు లక్ష్యాలు ఎంపిక చేసుకుని గ్రామాల అభివృద్ధికి పరస్పరం కృషి చేయాలని ఎంపీడీఓ వీర కిషోర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనం వద్ద గురువారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాలలో స్థానికంగా అందుబాటులో ఉండే వనరులను గుర్తించి వాటి ద్వారా అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సర్పంచ్‌ల సహకారంతో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. 2030, 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం ట్రైనర్లు సిబ్బంది, సర్పంచ్‌లకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బద్వేలు అర్బన్ : జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (క్రూష్మా) జిల్లా అధ్యక్షుడు లెక్కల జోగిరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన క్రూష్మా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న కడప నగరంలోని పవన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో క్రూష్మా జిల్లా జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో క్రూష్మా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, జిల్లా నాయకులు పి.బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పట్టణ నాయకులు వెంకటేశ్వర్లు, సుజాత, ప్రవీణ్, కుప్పయ్య, అంకయ్య పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : చట్టం అందరికీ సమానమేనా? అనే కరపత్రాన్ని గురువారం పట్టణంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం 10 గంటలకు కడపలో జరిగే సదస్సుకు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ముఖ్య వక్తగా విచ్చేస్తున్నారన్నారు. ఈ సదస్సుకు ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, యువజనులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిటీస్టు నాయకులు రవిశంకర్ రెడ్డి, ప్రతాప్, షరీఫ్, పౌరహక్కుల సంఘం నాయకులు వెంకటేష్, సురేష్‌బాబు, విరసం వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం పద్మ, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు హరిత, ఉమా, ప్రసన్న, జనవిజ్ఞాన వేదిక నాయకుడు సురేష్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకుడు సృజన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)లో ఫైనలియర్ ఈసీఈ, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ నెల 12న హైదరాబాదుకు చెందిన లోటస్ మైక్రో సిస్టమ్స్ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కోసం రాత పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించారు. ఇందులో 98 మంది విద్యార్థులు పాల్గొనగా 27 మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. వీరిలో 17 మంది ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపల్ డా.శృతి తెలిపారు. గ్రాడ్యుయేట్ ట్రైనీ ఇంజనీర్స్‌గా ఎంపికైన వారికి శిక్షణ అనంతరం రూ.3లక్షల వార్షిక వేతనం లభిస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పోరుమామిళ్ల: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ కార్మికులు శుక్రవారం జాతీయ ప్రైవేటీకరణ వ్యతిరేక దినంగా పాటించాలని పిలుపిచ్చారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో ఈ మేరకు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు మెడికల్ పాలసీ అమలు చేయాలని, హెల్త్ కార్డు మంజూరు చేయాలని కోరారు. ఈ నెల 22న కడపలో జరిగే విద్యుత్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్థలను పరిరక్షించుకోవాలన్నారు.

పోరుబాటకు రైతులంతా తరలిరండి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


వైఎస్సార్‌సీపీ గ్రామీణ నాయకులతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : రైతాంగ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కడప కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమానికి రైతులంతా తరలి రావాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లెలోని తన స్వగృహం వద్ద గురువారం ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల పరిధిలోని 30 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. వేలాది మంది రైతులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఇంత వరకు రైతులకు పెట్టుబడి సాయం అందించలేదన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి రూపాయి కూడా చెల్లించలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నాశనం చేసిందని, వాటిని పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తుపాన్ ప్రభావం కారణంగా రైతులు నష్టపోయారని తెలిపారు. నిబంధనలను తొలగించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు జరిగిన పంట నష్టాన్ని గుర్తించి రైతులను ఆదుకోవాలన్నారు. కడప కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా రైతులంతా సంఘీభావం తెలిపాలని కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలి

ఈ సందర్భంగా సాగునీటి సంఘాల ఎన్నికలపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నాయకులతో చర్చించి వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రభుత్వం నిర్వహించనున్న నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాల్సిందేనని నాయకులకు ఆయన తెలిపారు. ఆ మేరకు గ్రామీణ ప్రాంత నాయకుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటామన్నారు. వారి అభిప్రాయమే శిరోధార్యమన్నారు. ప్రొద్దుటూరు ఎంపీపీ శేఖర్‌యాదవ్, రాజుపాళెం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నక్కలదిన్నె సుబ్బారెడ్డి, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, మాజీ సర్పంచ్ పల్లా లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ర్యాలీ పోస్టర్ల ఆవిష్కరణ

పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, నాయకులు

మైదుకూరు : రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన రైతు ర్యాలీ పోస్టర్లను గురువారం మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసాతోపాటు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా వంటి ఆర్థిక సాయం వెనువెంటనే అందాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి సాయం అందలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన కూటమి ప్రభుత్వంపై నిరసన గళం వినిపించనుందని తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రైతాంగ సమస్యలపై కలెక్టర్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయన ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ మదీనా దస్తగిరి, బ్రహ్మంగారిమఠం జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, చాపాడు, బి.మఠం ఎంపీపీలు లక్ష్మయ్య, వీరనారాయణరెడ్డి, ఖాజీపేట మండల నాయకులు రాఘవరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, మైదుకూరు పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, భరత్ కుమార్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, ట్రాక్టర్ గౌస్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పూజల్లో గురువారం ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సర్వాంగ సుందరంగా అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించడం హర్షించదగ్గ విషయమని ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక నాయకులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, కన్వీనర్ యద్దారెడ్డి, సీనియర్ నాయకులు పుత్తాశ్రీరాములు, శివయ్య, రమేష్‌బాబు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు రామ్‌మోహన్‌రావు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ చేకూరుతుందని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో గురువారం ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పేద ఆర్యవైశ్య విద్యార్థులకు దాతల సహకారంతో ఉపకార వేతనాలు అందచేస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, బీటెక్ చదువుతున్న 150 మంది విద్యార్థులకు మొత్తం రూ.1.60 లక్షలను అందచేశారు. విద్యా సంబంధ అవసరాలకు ఉపకార వేతనాన్ని ఉపయోగించుకుని బంగారు భవిష్యత్‌కు బాట వేసుకోవాలన్నారు. కార్యదర్శి మురికి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ జయింట్ సెక్రటరీ మురికి సుబ్రహ్మణ్యం, కోశాధికారి మిట్టా శంకర్, కార్యవర్గ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

మామిడి పంటలకు బీమా చేసుకోవాలి


మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన వనశాఖాధికారి జయ భరత్‌రెడ్డి

అట్లూరు : మామిడి తోటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చేసుకోవాలని బద్వేలు ఉద్యానవన శాఖాధికారి జి.జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. మామిడి పంటకు నష్టం ఎక్కువగా ఉందని బీమా చేయించుకుంటే ఆర్థిక భరోసా ఉంటుందని తెలిపారు. గురువారం ఆయన బద్వేలు మండలంతో పాటు అట్లూరు మండల పరిధిలోని పలు మామిడి తోటలను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అనే సంస్థ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వచ్చే ప్రతికూల మార్పులతో పంటకు నష్టం సంభవిస్తే ఆర్థిక నష్టాల నుంచి రైతులను గట్టెక్కించేందుకు పంటల బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రబీ సీజన్‌లో మామిడి పంటకి 2024–25 సంవత్సరానికి గానూ ఈ నెల 15 తేదీ లోగా ఎకరాకు రూ.2,100 బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.42 వేల వరకూ బీమా వస్తుందని పేర్కొన్నారు.